క్లుప్తంగా

అగస్త్యేశ్వరునికి పూజలు



ప్రత్యేక పూజలందుకున్న అగస్త్యేశ్వర స్వామి

రాయచోటి జగదాంబసెంటర్ : పాత రాయచోటిలో వెలసిన శ్రీ దాక్షాయణీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కావడంతో స్వామి వారి మూలవిరాట్ మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం పలు పూజాది క్రతువులను ఆలయ అర్చకులు నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయం ప్రయోజనకరం



కూరగాయలను ప్రజలకు విక్రయిస్తున్న రైతు

సుండుపల్లె : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను తినడం ద్వారా ప్రజలకు ఎలాంటి జబ్బులు రాకుండా ఉంటాయని మండల ప్రకృతివ్యవసాయ సలహాదారుడు రామాంజనేయులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామంలో రైతు రెడ్డయ్య పొలంలో ఏటీఎం మోడల్స్ టమాటా, వంగ, మిరప, బెండ, ముల్లంగి, క్యారెట్, ఆకుకూరలు, కొత్తిమీర, చిర్రాకు, పాలాకు, చుక్కాకు, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు కొన్ని స్టాల్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు విక్రయించారు.

ఉల్లాస్‌పై దృష్టి సారించండి

లక్కిరెడ్డిపల్లి : ఉల్లాస్ కార్యక్రమం ద్వార స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే నైట్ వాచ్‌మెన్‌లను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టిసారించాలని ఎంపీడీఓ రెడ్డన్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉల్లాస్ వయోజన విద్యా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సాయంత్రం అంగన్‌వాడీ భవనాలలో తరగతులు నిర్వహించాలని, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ నోడల్ అధికారిగా వ్యవహరించాలని తెలిపారు. వాలంటీర్ టీచర్లు ఉల్లాస్ యాప్ ద్వారా నేర్చుకునేవారి పేర్లను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, సిసిఎస్ యానిమేటర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పరీక్షలలో విద్యార్థుల సత్తా

నందలూరు : స్కాలర్స్ ఇంటిగ్రల్ మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్ హైదరాబాదు వారు నిర్వహించిన జాతీయస్థాయి పరీక్షలలో తమ విద్యార్థులు సత్తా చాటారని జ్ఞాన దీప్తి పాఠశాల చైర్మన్ అద్దంకి జానకీనాథ్, ప్రిన్సిపాల్ నిడిగంటి లక్ష్మమ్మలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ జనవరి 2వ తేదీన బాలవికాస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పరీక్షలు నిర్వహించగా జనవరి 29న ఫలితాలు వెలువడ్డాయన్నారు. మ్యాథ్స్ విభాగంలో రెండో ర్యాంకు లక్ష్మీ జై, మూడో ర్యాంకు షేక్ అస్మా, సైన్స్ విభాగంలో షేక్ ఆయేషా, షక్ ముస్తకీం, షేక్ మహమ్మద్ ఇబ్రహీంలు ముగ్గురు మూడో ర్యాంకు సాధించారన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఎంజీపురం పంచాయతీలోని శ్రీనిలయ టౌన్‌షిప్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ పంచముఖ విఘ్న గణపతి దేవస్థానంలో సోమవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వాహకులు నిర్వహించారు. గత 3రోజుల నుంచి ఈ దేవస్థానంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సోమవారం శ్రీ పంచముఖ విఘ్న గణపతితోపాటు వివిధ దేవతా మూర్తుల విగ్రహాలను విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. వేడుకలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, ప్రజలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలానే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పోలా వెంకటరమణారెడ్డి, పి.విశ్వనాథరెడ్డి, ఎ.మధుబాబు, రెడ్డెయ్య, శివయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రామాపురం : ఈడబ్ల్యూఎస్ (కమ్మ, రెడ్డి, ఈబీసీ, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ) కమ్యూనిటీలలో ఆర్థికంగా వెనుకబడిన కాపు, బీసీ యువతకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జాషువా ప్రకటనలో తెలిపారు. మెడికల్ సంబంధించి బి.ఫార్మసిస్టు, ఎమ్.ఫార్మసిస్టు చేసిన అభ్యర్థులు, వ్యవసాయానికి రంగానికి పెస్ట్ లేజర్స్ వ్యాపారం ఇండస్ట్రీస్ తదితర రంగాలలో ఆసక్తి ఉన్న యువతకు ఈ రుణాలు 50శాతం సబ్సిడీతో 50శాతం బ్యాంకు రుణాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ తిప్పలు తీరేదెన్నడూ?

- కళగానే కోడూరు బైపాస్ రోడ్డు నిర్మాణం
- భారీ వాహనాల కారణంగా వాహనదారుల అవస్థలు
- ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపాలంటున్న ప్రజలు



రైల్వేస్టేషన్ రోడ్డులోని టోల్‌గేట్ వద్ద రోడ్డు పైన నిలిపిన వాహనాలు



మార్కెట్ స్ట్రీట్ వద్ద ఏర్పడిన ట్రాఫిక్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. రాఘవరాజపురం నుంచి కోడూరు టౌన్, తిరుపతి రోడ్డు వరకు ఎక్కడా చూసిన వందల మీటర్ల మేర వాహనాలు నిలిచి ఉన్న సంఘటనలు దర్శనమిస్తుంటాయి. ప్రధాన మార్గంలో ఉన్న దుకాణదారులు బీటీ రోడ్డు వరకు ఆక్రమించుకొని అంగళ్ల ముందు వరండాలు నిర్మించుకున్నారు. దీనికితోడు వాహనాలు దారిలో ఆపి కొనుగోళ్లు చేస్తుండటం వల్ల కూడళ్లలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ లారీలు ఆపేయడం, ప్రధాన రహదారిలో రోడ్డుకిరు వైపులా రహదారి వెడల్పు తక్కువగా ఉండటం, అలాగే చిరు వ్యాపారులు, ఆటోలు, బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆపివేయడంతో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు మాత్రం ఒకట్రెండురోజులు రోడ్డుపై పార్కింగ్‌పై వాహనదారులకు హెచ్చరిస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదు. రైల్వేకోడూరుకు బైపాస్ రోడ్డు లేకపోవడంతో చెన్నై నుంచి ముంబై వెళ్లే భారీ వాహనాలు పట్టణం నుంచే వెళుతుంటాయి. ఈ కారణంగా రాఘవరాజపురం, చిట్వేలి బైపాస్ సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, ముష్టేరు వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. అలానే మార్కెట్ రోడ్డు వద్ద, టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యతో ద్విచక్ర వాహనదారులు, నడిచి వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రులు, అంగళ్ల వద్ద వాహనాలు రోడ్డుకు అరభాగం వరకు ఆక్రమించుకుని వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఆటోలైతే వారికి ఇష్ట మొచ్చినట్లు నిబంధనలు అతిక్రమించి రోడ్డుపై వాహనాలు నిలుపుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారు. దీంతో చిన్నపాటి ప్రమాదాలు పదే పదే జరుగుతున్నాయి. పోలీసులు, మండల అధికారులు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోడూరు వాసులు విన్నవిస్తున్నారు.

దుమ్ము, ధూళితో సమస్యలు తీవ్రం

మంగంపేటకు చెందిన భారీవాహనాలు వెళ్లేటప్పుడు రోడ్డుపై ఉన్న దుమ్ము విపరీతంగా లేస్తోంది. దీంతో వాహనచోదకులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దుమ్ము కళ్లల్లో పడుతుండటంతో వాహనం నడపడం కష్టతరంగా మారింది. అధికారులు రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు చేపడితే ట్రాఫిక్ సమస్యను కొంతవరకు తగ్గించిన వారవుతారని ప్రజానీకం తెలియజేస్తున్నారు.

బైపాస్ రోడ్డు నిర్మించాలి



పట్టణంలో నుంచి జాతీయ రహదారి వెళుతుండటంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. దీంతో ద్విచక్రవాహనాలు నడపాలంటేనే భయంగా ఉంటోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు ప్రమాదాలను నియంత్రించాలంటే రాఘవరాజపురం నుంచి మైసూరావారిపల్లె వరకు రోడ్డును తప్పనిసరిగా వెడల్పు చేయాలి. ఆక్రమణలతో దారి తగ్గుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలానే భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం కోడూరుకు బైపాస్ రోడ్డు మంజూరు చేసి వెంటనే నిర్మించాలి.

– రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఉర్లగడ్డపోడు, రైల్వేకోడూరు

భారీ వాహనాలతో ఇబ్బంది



రోజురోజుకు ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. భారీ వాహనాలు ఓ కారణంగా షాప్‌ల ముందు పార్కింగ్ ఇష్టానుసారంగా చేస్తుండటం మరో కారణం. అధికారులు అడపదడపా వస్తూ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలకు ఫైన్ వేస్తున్నారనే తప్ప సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడంలేదు. పట్టణంలో భారీ వాహనాలు పార్కింగ్ చేయకుండా అధికారులు చర్యలు తీసుకుంటే ట్రాఫిక్‌ను కొద్దోగొప్పో తగ్గించవచ్చు.

– కాకర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరాజపురం, రైల్వేకోడూరు

పెట్రోలింగ్ ద్వార నియంత్రణకు చర్యలు



పట్టణంలో వాహనాల వినియోగం పెరిగింది. దుకాణాల వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్డుపై పార్కు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కోడూరుకు బైపాస్ రోడ్డు లేకపోవడంతో భారీ వాహనాలు సైతం ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపడమే కాక బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరతాం.

– నవీన్‌బాబు, ఎస్‌ఐ, రైల్వేకోడూరు

పారదర్శక చెల్లింపులకే క్యూఆర్ కోడ్



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ఈఈ యుగంధర్

రాయచోటి అర్బన్ : పారదర్శక చెల్లింపులకే విద్యుత్ శాఖ క్యూఆర్ కోడ్‌ను తీసుకొచ్చిందని విద్యుత్ శాఖ రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్ తెలిపారు. పట్టణంలోని విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయ ఆవరణలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రం వద్ద విచ్చేసిన వినియోగదారులకు క్యూ ఆర్ కోడ్ ద్వారా బిల్లులను ఎలా చెల్లించవచ్చో అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ప్రతినెలా అందజేసే కరెంటుబిల్లు డిమాండ్ నోటీసు కింది భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను పేమెంట్ యాప్‌ల ద్వారా స్కాన్ చేసిన వెంటనే బిల్లుకు సంబంధించి అమౌంట్ సంబంధిత 13 అంకెలు గల విద్యుత్‌సర్వీసు నంబరు యాప్‌లో కనిపిస్తుందన్నారు. సర్వీసు నంబరును నిర్ధారించుకున్న తరువాత బిల్లులను చెల్లించాలంటూ కోరారు. వినియోగదారులు ఇక ముందు తమ ఇళ్ల వద్ద నుంచే కరెంటు బిల్లులను చెల్లించవచ్చంటూ తెలియజేశారు. ఈ సదుపాయాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ పాపయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చాన్‌బాషా, సిబ్బందిలు పాల్గొన్నారు.

నేటి నుంచి భోగాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



కుంపిణీపురంలోని భోగాంజనేయస్వామి ఆలయం

నందలూరు : మండలంలోని కుంపిణీపురం భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం (నేడు) ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచే కాక ఇతర జిల్లాల నుంచి భక్తులు రానున్నారు. జాగీర్‌దారుల ఆరాధ్య దైవమైన కుంపిణీపురం భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం ఉపనయనం, ఆస్థాన పూజలు, పంచామృతాభిషేకం, స్వామివారికి ఆకుపూజ, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆర్కెస్ట్రా వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. అలానే 5వ తేదీన ఉదయం పంచామృతాభిషేకం, గ్రామోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరగనుంది. అలాగే 6న గురువారం స్వామివారి రథోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు.

బండలాగుడు పోటీలు

బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు పలు ప్రాంతాల నుంచి ఎద్దులు రానున్నాయి. గెలుపొందిన వారికి మొదటి బహుమతి కింద రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.40వేలు, తృతీయ బహుమతి కింద రూ.30 వేలు, నాల్గో బహుమతి కింద రూ.20 వేలు, ఐదో బహుమతి కింద రూ. 10 వేలు, ఆరో బహుమతి కింద రూ.7 వేలు, ఏడవ బహుమతి కింద రూ. 5 వేలు అందించడం జరుగుతుందని నిర్వాహకులు గణపతి శంకర్, సంబావు చంద్రశేఖర్ తెలిపారు.

విద్యార్థి నాయకుల అరెస్టు అప్రజాస్వామికం



సీఐకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రాయచోటి నియోజకవర్గం సంబేపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేసి వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని తెలుపుతూ సోమవారం బీకేఎం జిల్లా అధ్యక్షులు పందుగోలు మణి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దార్ల రాజశేఖర్‌లు సీఐ హేమసుందర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సభలో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేసిన జిల్లా కార్యదర్శి మాధవ్‌తోపాటు మరికొందరిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు అందరికి ఉంటుందన్నారు. సమస్యల ఉద్యమించకుంటే పరిష్కారం ఎలా అవుతాయని ప్రశ్నించారు. అరెస్టులతో ఉద్యమకారుల ప్రజాగళాన్ని ఆపలేరనేది ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వినయ్, జయరామయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు నాగరికతకు ప్రతీకలు



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : ఆలయాలు నాగరికతకు ప్రతీకలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గున్నికుంట్ల గ్రామం దిగువ రాచపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో జరిగిన నూతన విగ్రహ ప్రతిష్ట, కల్యాణోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రతేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు సమష్టి కృషితో ఇంత పెద్ద ఆలయాన్ని నిర్మించుకోవడం హర్షనీయమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వేణుగోపాల్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, వీవీ ప్రతాప్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చిట్టి, లక్ష్మీకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి, నాగిరెడ్డి అశోక్‌రాజు, అశోక్‌రెడ్డి, భూషన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యను వింటున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్



వినతులు స్వీకరిస్తున్న ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే

రాజంపేట : వారిద్దరు సివిల్స్ విజేతలు..పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. రాజంపేట సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభాభవనంలో సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. అలాగే రాజంపేట ఎస్‌డీపీఓ కార్యాలయంలో ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తమ కార్యాలయానికి వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. వారి సమస్యలను సానుకూలంగా ఉన్న పరిష్కారదిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీస్ మెయింటెన్ చేయాల్సి ఉంటుందని సిబ్బందికి సూచించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు



రైల్వేకోడూరు అర్బన్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



రాజంపేట రూరల్: ఫీజుపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట రూరల్ : విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటమాడటం తగదని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోలా వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఫీజు పోరు పోస్టర్లను పోలా వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యార్థుల కోసం నూతన పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు విద్యకు పెద్దపీట వేసి విద్యార్థులను ప్రోత్సహించారని కొనియాడారు. నేటి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి విద్యార్థులను మానసింగా వేదిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీ జిల్లా కేంద్రమైన రాయచోటీలో ఫీజు పోరులో భాగంగా నిరసన ర్యాలీ, కలక్టరేట్ దిగ్బంధన కార్యక్రమం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని విశ్వనాథరెడ్డి, మిరియాల సురేఖ, వడ్డే రమణ, దండు గోపీ, గోవిందు బాలక్రిష్ణ, ఎస్.జావీద్‌అలీ, ఎస్.గౌస్‌బాషా, ఎ.వరదరాజు, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, రంగాల కమాలకర్, చింతా నరసింహారెడ్డి, పోలీ రఘునాథరెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో జరిగే ఫీజు పోరును విజయవంతం చేయాలని సోమవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు సంపద సృష్టించి ప్రజలకు మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పులు చేస్తూ పథకాలు అమలు చేయకుండా 8 నెలల్లోనే ప్రజలపై భారం మోపడం ఏంటని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, రాష్ట్ర కార్యదర్శి మందల నాగేంద్ర, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్ బుడుగు శివయ్య, యనమాల మహేష్, రత్తయ్య, హరికృష్ణారెడ్డి, సిద్దు, కృష్ణారెడ్డి, అరుణ, ఫరుక్, కరీముల్లా తదితర నాయకులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



నిరసన తెలుపుతున్న అంగన్ వాడీలు

లక్కిరెడ్డిపల్లి : అంగన్‌వాడీ వర్కర్లను, హెల్పర్లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు టి.సుకుమారి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సీఐటీయూ రాష్ట్ర పిలుపు మేరకు అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్‌తో కలసి సీడీపీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వెంటనే అమలు చేయాలన్నారు. ఏడవ పే కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు రెగ్యులేషన్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు ప్రభావతి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

చెన్నయ్యగారిపల్లిలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ శరత్ కమల్

నందలూరు : మండలంలోని ఎర్రచెరువుపల్లి గ్రామ పంచాయతీ చెన్నయ్యగారిపల్లి బీసీ కాలనీలో మండల వైద్యాధికారి కె.శరత్ కమల్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కమల్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 30 మందికి చికిత్సలు నిర్వహించడం జరిగిందన్నారు. వారిలో జ్వరంతో బాధపడుతున్న వారు ఇద్దరు, బీపీ, షుగర్‌తో 20 మందికి, ఇతరులకు 8 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ఇ–పంట నమోదుకు రైతులు సహకరించాలి



మాచుపల్లె రైతు సేవాకేంద్రంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ

సిద్దవటం : ఇ–పంట నమోదు వంద శాతం జరిగేలా రైతులు సహకరించాలని బద్వేల్ ఏడీఏ నాగరాజ కోరారు. సోమవారం మండలంలోని మాచుపల్లె, టక్కోలు రైతుసేవా కేంద్రాలను ఆయన తనిఖీ చేసి, ఇ–పంటను నమోదుపై సిబ్బందితో సమీక్షించారు. ఈ నెల 14వ తేదీలోపు ఇ–పంట నమోదు వీఆర్‌ఓల ధృవీకరణ, రైతుల ఈకేవైసీ పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి రైతుకు పీఎం కిసాన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని అవలంభించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. శాఖ పరమైన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. పంటకోత ప్రయోగాల డేటాను సంబంధిత యాప్, వెబ్‌సైట్‌లలో అప్‌లోడు చేయాలని తెలియజేశారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమున్న వారు కేంద్రాలలో సంప్రదించాలని రైతులకు తెలిపారు. వరిలో కాండం తొలచు పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్‌ను, నువ్వులు, మినుముల్లో రసం పీల్చు పురుగు నివారణకు ఎకరాకు 20 జిగురు పూసిన పసుపు, తెలుపు, నీలం రంగు పల్లాలు అమర్చాలన్నారు. వేరుశనగలో పొగాకు లద్దెపురుగు నివారణకు క్లోరంట్ర నిలిప్రోల్ 0.30 మిల్లీ లీటర్లుకు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వంశీ శివఫణీంద్ర, లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

వివిధ పాఠశాలల్లో, పలు ఆలయాల్లో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి విగ్రహాలు, చిత్రపటాలకు విశేషంగా పూజలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. ఇదిలావుంటే పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. కాగా రాజంపేటలోని అమ్మవారిశాలలో సామూహికంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు.

– సాక్షి, నెట్‌వర్క్



నందలూరు: సరస్వతీదేవి పూజలో టీచర్లు



పుల్లంపేట మండలంలోని సంస్కృత పాఠశాలలో..



రాజంపేట టౌన్: అలంకరణలో సరస్వతీదేవి



రాజంపేట టౌన్: సామూహిక అక్షరాభ్యాసం



రాజంపేట రూరల్: రాజు హైస్కూల్‌లో..